ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 7 ఏప్రిల్ 2025


పాంబన్ వంతెన ప్రారంభిస్తున్న దృశ్యం




రామేశ్వరాలయంలో ప్రధాని పూజలు

పాంబన్ వంతెన ప్రారంభం

రూ.8,300 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

తమిళనాడు అభివృద్ధికి కృషి

ప్రపంచ నలుమూలలకు తమిళ భాష

ప్రారంభోత్సవ సభలో ప్రధాని మోదీ

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని, ప్రపంచం నలుమూలలకు తమిళ భాష చేరేలా తాము కృషి చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం వాయుసేన హెలిక్యాప్టర్‌లో శ్రీలంక నుంచి రామనాథపురం జిల్లా మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ వద్ద నిర్మితమైన దేశంలోనే ప్రప్రథమ లిఫ్ట్ సముద్ర వంతెనను ప్రారంభించారు. అదే విధంగా వంతెన పైనుంచి రైలు, కింది నుంచి ఓడ రవాణాకు కూడా పచ్చజెండా వూపి ప్రారంభించారు. వీటితోపాటు రూ.8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ప్రధాని మాట్లాడుతూ... రామనాథస్వామిని దర్శించి పూజలు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శ్రీరామనవమి రోజున తమిళనాట అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం తనకు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. సాంకేతికత-సంప్రదాయాల మేళవింపుతో 21వ శతాబ్దం ఇంజనీరింగ్ అద్భుతంగా అనుసంధానించడిన ఇంజనీర్లు, నిపుణులను ప్రధాని అభినందించారు. "దేశంలోని ప్రతి ప్రాంతం ఒకదానితో ఒకటి అనుసంధానించబడినప్పుడు, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని చెబుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వున్న ప్రతి అభివృద్ధి చెందిన దేశంలో ఇదే పరిస్థితి వుందన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రం అనుసంధానించబడినందున దేశం పూర్తి సామర్థ్యం సాకారమవుతుందన్నారు. ఈ అనుసంధానం తమిళనాడుతో సహా దేశంలోని ప్రతి ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. 2014కి ముందు తమిళనాడులోని రైలు ప్రాజెక్టులకు ఏటా రూ.900 కోట్లు మాత్రమే వచ్చేవని, అయితే ఈ సంవత్సరం తమిళనాడు రైల్వే బడ్జెట్ రూ.6వేల కోట్లకు మించిందన్నారు. రామేశ్వరం స్టేషన్‌తో సహా రాష్ట్రంలోని 77 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు.

"గత పదేళ్లలో గ్రామీణ రోడ్లు, రహదారుల అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించాం. 2014 నుంచి కేంద్రప్రభుత్వ మద్దతుతో తమిళనాడులో 4 వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించబడ్డాయి. చెన్నై ఓడరేవును కలిపే ఎలివేటెడ్ కారిడార్ అద్భుతమైన మౌలిక సదుపాయాలకు మరొక ఉదాహరణగా నిలుస్తుంది. విస్తృతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి వివిధ రంగాల్లో కొత్త ఉద్యోగాల సృష్టికి దారి తీస్తుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద తమిళనాడులోని చిన్న రైతులు దాదాపు రూ.12 వేల కోట్లు అందుకున్నారు. తమిళనాడు రైతులు కూడా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నుంచి ప్రయోజనం పొందారని, దీని క్లెయిమ్‌లు రూ.14,800 కోట్లు" అని వివరించారు.

"భారత 'బ్లూ ఎకానమీ' దేశవృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, ఈ రంగంలో తమిళనాడు బలం ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడుతుందన్నారు. తమిళనాడు మత్స్యమౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి కేంద్రప్రభుత్వం అవసరమైన సహాయం చేస్తుందని మోదీ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో తమిళనాడు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద గణనీయమైన నిధులను పొందింది. మత్స్యకారుల భద్రత, వారి సంరక్షణ కోసం మా ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోంది" అని ప్రధాని స్పష్టం చేశారు.


వంతెన మీదుగా మొదటి రైలుకు పచ్చజెండా ఊపుతున్న ప్రధాని

శ్రీలంక నుంచి మండపం ప్రాంతానికి....

రామనాథపురం జిల్లా పాంబన్ వద్ద రూ.535 కోట్లతో నిర్మించిన కొత్త రైలు వంతెనను ఆదివారం 12.30 గంటల ప్రాంతంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ప్రధాని మోదీ శ్రీలంకలోని అనూరాధ పురం నుండి భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్‌లో బయలుదేరి 12.15 గంటలకు మండపంలో దిగారు. హెలీపాడ్ వద్ద గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సమాచార శాఖ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, రాజకన్నప్పన్, ఎంపీ నవాజ్‌ఖనీ, రామనాథపురం కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ కాలోనే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఎమ్మెల్యేలు వానతి శ్రీనివాసన్, నయినార్ నాగేంద్రన్, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీనియర్ నేతలు హెచ్‌రాజా, తమిళిసై సౌందరరాజన్, పొన్ రాధాకృష్ణన్, సినీనటుడు శరత్‌కుమార్, అరవింద్ మేనన్, కరుప్పు మురుగానందం, టీఎంసీ నేత జీకే వాసన్ సాదర స్వాగతం పలికారు. ఆ తర్వాత అక్కడి నుండి రోడ్డుమార్గంలో పాంబన్ రైలు వంతెనకు సమీపంలో ఉన్న పాంబన్ రహదారి వంతెన మధ్య భాగానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక వేదికపై నిలిచి పాంబన్ కొత్త రైలు వంతెనను ప్రారంభించారు. ఆ వంతెనపై మీదుగా నడిచే రామేశ్వరం - తాంబరం మొదటి రైలు సర్వీసుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. చివరగా కొత్త పాంబన్ వంతెన దిగువ నౌకలు ప్రయాణించేందుకు నిర్మించిన లిఫ్ట్‌ను కూడా రిమోట్ ద్వారా ప్రారంభించారు. ఆ లిఫ్ట్ పైకి లేవగానే దాని దిగువనే సముద్రంలో కోస్ట్‌గార్డ్‌కు చెందిన ఓ నౌక ప్రయాణించడాన్ని మోదీ ఆసక్తిగా తిలకించారు. అక్కడి నుండి కారులో రామేశ్వరం ఆలయానికి వెళ్లిన ప్రధానికి.. రహదారికి ఇరువైపులా నిలిచిన ప్రజలు, పర్యాటకులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1.15 గంటలకు మోదీ రామేశ్వరం ఆలయానికి వెళ్ళారు. స్వామివారి దర్శనానంతరం రామేశ్వరం బస్‌స్టేషన్ సమీపంలో పర్యాటక శాఖ రెస్టారెంట్ మైదానం వద్ద ఏర్పాటైన సభలో ప్రసంగించారు. రామనాథస్వామి ఆలయంలో మోదీ పావుగంట వున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఉదయం ఎనిమిది నుండి మధ్యాహ్నం 3 గంటల దాకా భక్తుల దర్శనాలను నిలిపేశారు. అదే సమయంలో ఆలయంచుట్టూ సుమారు వెయ్యిమందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

4 రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన...

రామేశ్వరం బస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటైన బహిరంగ సభావేదికపై నుంచి వాలాజాపేట- రాణిపేట, విల్లుపురం - పుదుచ్చేరి, పూండియన్ కుప్పం - చట్టనాథపురం, చోళపురం - తంజావూరు మధ్య రూ.8300 కోట్లతో చేపట్టే ఫోర్‌వే ప్రాజెక్టులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సభ ముగిశాక ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో సాయంత్రం 3.50 గంటలకు మదురై విమానాశ్రయం చేరుకున్న ప్రధాని.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్ళారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రధాని




ప్రధానికి స్వాగతం పలుకుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

వేదికపై నయినార్ నాగేంద్రన్‌కు స్థానం...

రామేశ్వరంలోని సభా వేదికపై బీజేపీ శాసన సభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్ చోటు లభించడం చర్చనీయాంశమైంది. ముందుగా నిర్దేశిత కార్యక్రమం ప్రకారం వేదికపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూర్చోవాల్సి ఉంది. అయితే ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం నుంచి చివరిక్షణంలో వచ్చిన ఆదేశాల మేరకు వేదికపై కూర్చొనే అవకాశం నయినార్ నాగేంద్రన్‌కు దక్కినట్లు సమాచారం. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వేదిక దిగువన ముందు వరుసలో కూర్చున్నారు. బీజేపీ అధ్యక్షపదవికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న వారిలో నయినార్ నాగేంద్రన్ ఉండటం వల్లే చివరి క్షణంలో ఈ మార్పు జరిగిందని పార్టీ రాష్ట్ర విభాగం నాయకులు భావిస్తున్నారు.


మోదికి శ్రీరామపట్టాభిషేకం చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

మోదీకి నల్ల బెలూన్లతో నిరసన

ప్రధాని మోదీ పాంబన్ పర్యటన సందర్భంగా ఆయనకు నల్ల బెలూన్లతో స్వాగతం పలికేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సుమారు 50 మందిని పోలీసులు అరెస్టు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, వక్ఫ్ చట్టం అంటూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఖండిస్తూ మోదీ రాక సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరుపుతామని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఆదివారం ఉదయం పాంబన్ వద్ద స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు మోదీకి వ్యతిరేకంగా నల్ల బెలూన్లు ఎగరవేయటానికి ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని అందరినీ అరెస్టు చేశారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే

పునర్విభజన పేరుతో కుట్ర

- ఊటీ సభలో సీఎం స్టాలిన్ ఆరోపణ


ఊటీలో 143.69 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : డీఎంకే ద్రావిడ తరహా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండడం చూసి ఓర్వలేకే కేంద్రంలోని బీజేపీ పాలకులు నియోజకవర్గాల పునర్విభజన పేరుతో భారీ కుట్ర పన్నుతున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విరుచుకుపడ్డారు. నీలగిరి జిల్లా ఊటీ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో రూ.149.69 కోట్లతో నిర్మించిన నీలగిరి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. అదే విధంగా రూ.727 కోట్లతో పూర్తయిన వివిధ పథకాల ప్రారంభోత్సవం, 56 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, 15,634 మంది లబ్దిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో ఆర్థిక వృద్ధిరేటు 9 శాతం దాటిందన్నారని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుండటాన్ని చూసి బీజేపీ పాలకులు సహించలేకపోతున్నారని ఆరోపించారు. పునర్విభజన వల్ల రాష్ట్రానికి ఎలాంటి నష్టాలు జరుగవని ప్రధాని మోదీ హామీ ఇవ్వాలని, ఈ విషయాన్ని రామేశ్వరంలో పాంబన్ వంతెన ప్రారంభోత్సవ సభలో ప్రకటించేందుకు సిద్ధమేనా అని తాను ప్రశ్నించానని, ఆ ప్రశ్నకు ఇంకా బదులివ్వలేదన్నారు. న్యాయసమ్మతమైన పునర్విభజన కోసం దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఏర్పాటైన ఉమ్మడి కార్యాచరణ కమిటీ ప్రధానిని కలిసి వినతి పత్రం అందించేందుకు సిద్ధమైందని, ఆ కమిటీ ప్రతినిధుల బృందాన్ని కలిసేందుకు అప్పాయింట్‌మెంట్ త్వరగా ఇస్తారని ఆశిస్తున్నానని స్టాలిన్ పేర్కొన్నారు. నీలగిరి జిల్లాలో ముందుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండటం వల్లే ప్రధాని మోదీ పాల్గొన్న పాంబన్ వంతెన ప్రారంభోత్సవ సభకు హాజరుకాలేకపోయానని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ నీట్ లేదని, అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాకనే నీట్ పరీక్షలు వచ్చాయని, ఇందుకు ఎడప్పాడి పళనిస్వామి కారణమన్నారు. మాజీ ముఖ్యమంత్రులు ఓపీఎస్, ఈపీఎస్ బీజేపీ పాలకుల అడుగులకు మడుగులొత్తే విధంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఈపీఎస్‌కు రాష్ట్రంలో విద్యార్థులను ఆదుకోవాలనే ఆకాంక్ష ఉంటే నీట్ రద్దు చేస్తేనే బీజేపీతో పొత్తుపెట్టుకుంటానని ఆ పార్టీ జాతీయ నాయకులతో చెప్పగలరా అని స్టాలిన్ సవాలు విసిరారు.

నీలగిరికి ఆరు పథకాలు...

ఈ కార్యక్రమంలో నీలగిరి జిల్లాల్లో చేపట్టనున్న ఆరు పథకాలను గురించి స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు నీలగిరి జిల్లాలో ఇళ్లులేని నిరుపేద, బలహీన వర్గాలకు చెందినవారి కోసం గూడలూరు వద్ద రూ.26.06 కోట్లతో 300 ఇళ్లతో కలైంజర్ నగర్ నిర్మిస్తామన్నారు. నీలగిరి జిల్లాలోని గిరిజనుల జీవిత విశేషాలు, ప్రజలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులు అందరికీ తెలిసేలా మ్యూజియం పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నీలగిరి జిల్లా అంతా ప్రకృతి అందాలు వీక్షించేలా రూ.5 కోట్లతో 10 కొత్త బస్ సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. ఊటీలో సమ్మర్ సీజన్లలో ఏర్పడే ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.20 కోట్లతో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామని, నడుకాణి వద్ద జన్యు సంబంధిత ప్రకృతి సిద్ధమైన పర్యాటక కేంద్రాన్ని రూ.3 కోట్లతో నెలకొల్పుతామని స్టాలిన్ ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రులు ఏవీ వేలు, ఎంపీ సామినాధన్, ఎం.సుబ్రమణియం, ప్రభుత్వ విప్ రామచంద్రన్, ఎంపీ రాజా, నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో వైభవంగా 'నవమి' ఆస్థానం


హాజరైన మాజీ కమిటి సభ్యులు - ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివార్లు

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో వున్న శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీరామనవమి సందర్భంగా ఆస్థానం వైభవంగా నిర్వహించారు. నవమిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని అరటి,మామిడి, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 9 గంటలకు ఏఈవో కె.పార్థసారధి అధ్యక్షతన టీడీటీ సలహా మండలి మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్, నూతలపాటి శ్రీకృష్ణ, ఆనంద్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ సభ్యులు మేళతాళాలతో పట్టువస్త్రాలు, ఫలాలను ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై శ్రీసీతారామలక్ష్మ హనుమంత స్వామి వార్లను ఆస్థానం చేశారు. అనంతరం విశ్వక్సేన అంకురార్పణం, హోమపూజ, వేదపారాయణం, భక్తుల నామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య ఆలయ అర్చక స్వాములు మాంగల్యధారణ, మాలధారణ, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికి ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో భాగంగా కళాకారులు ప్రదర్శించిన శ్రీరామ పట్టాభిషేకం నృత్యనాటిక అందరినీ ఆకట్టుకుంది.

సమరశీల పోరాటాలకు సిద్ధం కండి

- సీపీఎం జాతీయ మహాసభల్లో నేతల పిలుపు ● జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంకే బేబి ● సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు


వేదికపై నేతలు

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద రాజకీయాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జాతీయ మహాసభల్లో వక్తలు పిలుపునిచ్చారు. సీపీఎం 24వ జాతీయ మహాసభలు ఈ నెల 2 నుంచి ఆదివారం వరకు మదురైలో జరిగాయి. మహాసభల చివరి రోజున మదురైలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. సుమారు 25వేల మంది రెడ్ షెట్ వాలంటీర్లు, లక్షలాది మంది కార్యకర్తలతో జరిగిన ప్రదర్శనతో మదురై నగరం ఎరుపు మయమయింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సమన్వయకర్త ప్రకాష్ కారత్, నేతలు బృందాకారత్, రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం సహా పలువురు నేతలు ప్రసంగించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిత్యావసరాల ధరలను అదుపుచేయడంలో విఫలమైందన్నారు. పన్నుల పేరుతో సామాన్య ప్రజలపై భారం మోపుతున్న కేంద్రం, కార్పొరేట్ సంస్థలకు వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో పరిపాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వం, మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా చర్యలు చేపట్టిందన్నారు. ప్రజా, కార్మిక, కర్షక వర్గాలకు వ్యతిరేకంగా బీజేపీ సాగిస్తున్న విధానాలను అడ్డుకొనేందుకు సీపీఎం ముందుంటుందని వక్తలు పేర్కొన్నారు.


అరుణ వర్ణమైన మదురై వీధులు

జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబి...

జాతీయ మహాసభలో నూతన జాతీయ కార్యదర్శిగా ఎంఏ బేబిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభ చివరి రోజున జరిగిన సమావేశంలో, 18 మందితో పోలిట్ బ్యూరో, 85 మందితో జాతీయ కమిటీ ఏర్పాటైంది. రాష్ట్రం నుంచి కె.బాలకృష్ణన్, వి.వాసుకి, పి.సంపత్, పి.షణ్ముగం, ఆర్.కరుమలైయన్, ఎన్.గుణశేఖరన్, కె.బాలభారతి తదితరులు జాతీయ కమిటీకి ఎంపికయ్యారు.

స్టాలిన్ అభినందనలు...

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీకి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అభినందనలు తెలిపారు. ఎంఏ బేబి ప్రయాణం విద్యార్థి సంఘ నాయకుడిగా ప్రారంభమై కేరళ విద్యా విధానం రూపొందించే వరకు కొనసాగిందన్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, సమాఖ్య తత్వాన్ని పరిరక్షించేందుకు మా ప్రయత్నం బలపడుతుందని ఎంకే స్టాలిన్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు.

సమాచార దర్శిని

9న 'జామ్' తయారీపై శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి సిప్పెట్ కళాశాల సమీపంలోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ శిక్షణా కేంద్రంలో ఈ నెల 9న పలురకాల జామ్‌ల తయారీపై శిక్షన ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు 044-29530048 అనే నెంబరు సంప్రదించవచ్చు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పమ్మల్‌లో ఈ నెల 20వ తేది జరుగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు పేర్లు నమోదుచేసుకోవచ్చు. ఆనందన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 4వ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు పమ్మల్‌లోని శంకర గ్లోబల్ అకాడమీలో నిర్వహించనున్నారు. ఇందులో 8,11,13,25 ఏళ్ల విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా 'ఫిడే' నిబంధనల ప్రకారం 'స్విస్' ప్రాతిపదికన పోటీలు నిర్వహించనున్నారు. ప్రతి విభాగంలో మొదటి స్థానంలో నిలిచే విజేతలకు చెస్ పోటీల్లో వినియోగించే గడియారం బహుమతిగా ఇవ్వనున్నారు. పోటీలకు సంబంధించిన వివరాలకు 9710286934 అనే నెంబరు సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతిరోజూ బస్సు డ్రైవర్లకు 'బ్రీత్ ఎనలైజర్' పరీక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతిరోజు 'బ్రీత్ ఎనలైజర్' పరీక్షలు తప్పనిసరి చేశారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సుల్లో కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో విధులకు హాజరవుతున్నట్లు ఫిర్యాదులందాయన్నారు. సంస్థకు చెడ్డ పేరు తెచ్చేలా ఇలాంటి చర్యలను నియంత్రించడంతో పాటు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం రూ.1.79 కోట్లతో బ్రీత్ ఎనలైజర్ పరికరాలు కొనుగోలు చేశామన్నారు. ఇక నుంచి ప్రతిరోజు డ్రైవర్లు, కండక్టర్లకు ఈ పరికరం ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం సేవించి విధులకు హాజరయ్యే ఉద్యోగులపై కఠిన చర్యలు చేపడతామని రవాణా సంస్థ హెచ్చరించింది.

డీఎంకే ఎంపీపై కేసు రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ తంగ తమిళ్‌సెల్వన్‌పై నమోదైన కేసును మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. కరోనా నిబంధనలు అమలులో ఉన్న 2021 ఫిబ్రవరి 21న నిబంధనలు అతిక్రమించి తేని జిల్లా శంకరాపురం, పాడి తదితర ప్రాంతాల్లో డీఎంకే ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారంటూ తంగ తమిళ్ సెల్వన్‌పై బోడినాయకనూరు పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు రద్దు చేయాలని ప్రస్తుత డీఎంకే ఎంపీ తంగ తమిళ్ సెల్వన్ తరఫున దాఖలు చేసిన పిటిషన్‌లో... కరోనా నిబంధనల ఉల్లంఘన కేసులు వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, అందువల్ల తనపై ఉన్న కేసు రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జీకే ఇళందిరయన్ ఆయనపై ఉన్న కేసు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

● ఆర్ఎండీ ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవంలో వక్తల పిలుపు



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించుకొని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆర్ఎండీ ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవ వేడుకల్లో వక్తలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. తిరువళ్లూర్ జిల్లా కవరపేట సమీపంలోని ఆర్ఎండీ ఇంజనీరింగ్ కళాశాల 19,20వ స్నాతకోత్సవాలు ఆదివారం కళాశాల ప్రాంగణంలో జరిగాయి. ఇందులో 64 మంది ర్యాంక్ హోల్డర్లు, 989 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. వేడుకలకు ఆర్ఎండీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్-చైర్మన్ ఆర్ఎస్ మునిరత్నం అధ్యక్షత వహించి మాట్లాడుతూ... భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముఖ్యఅతిథిగా హాజరైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అకడమిక్ అలియన్స్ గ్రూప్ హెడ్ డా.కేఎం సుశీంద్రన్ మాట్లాడుతూ... విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దడంలోను, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోను ఆర్ఎంకే విద్యాసంస్థల కృషి అభినందనీయమన్నారు. ఆర్ఎంకే గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ ఆర్ఎం కిషోర్, డైరెక్టర్ ఆర్.జ్యోతినాయుడు, సెక్రటరీ యలమంచి ప్రదీప్, వైస్ చైర్‌పర్సన్ డా.దుర్గాదేవి , మేనేజ్‌మెంట్ ట్రస్టీ సౌమ్య కిషోర్, విద్యాసంస్థల అడ్వయిజర్స్ తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డా.ఎమ్మెస్ పళనిస్వామి, దేవాదాయ శాఖ మాజీ కమిషనర్ టి.పిచ్చాండి, తమిళనాడు మినరల్ మాజీ డైరెక్టర్ వి.మనోహరన్ అతిథులు, నిర్వాహకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎండీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.అన్బుచెళియన్ స్వాగతం పలుకగా, రీసెర్చ్ డీన్ డా.కేకే త్యాగరాజన్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.

ఘనంగా సాధకుల రోజు

సత్యభామ డీమ్డ్ వర్సిటీలో 91.87శాతం ప్లేస్‌మెంట్స్



ఉద్యోగాల నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూరు ఓఎమ్మార్ రోడ్డులో వున్న సత్యభామ డీమ్డ్ వర్సిటీలో సాధకుల రోజును వేడుకగా జరుపుకున్నారు. ఛాన్సలర్ డాక్టర్ మరియ జీనా జాన్సన్, ప్రెసిడెంట్ డాక్టర్ మేరీ జాన్సన్, వైస్ ప్రెసిడెన్స్ జె.అరుళ్‌సెల్వన్, మరియ బెర్నాడిటీ సమక్షంలో శనివారం సాయంత్రం 2025వ సంవత్సరానికి సంబంధించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రపంచంలోనే పలు దేశాల్లో పేరొందిన 300లకు పైగా ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. ఇందులో 3,120 మంది విద్యార్థులు (91.87 శాతం) ఎంపికయ్యారు. వీరికి ఆయా కంపెనీల్లో వార్షిక వేతనంగా రూ.5.45 లక్షల నుండి రూ. 41.80 లక్షల వరకు అందనుంది.. అదేవిధంగా ఈ వర్సిటీ ఆధ్వర్యంలో సుమారు 216 మంది విద్యార్థులు అమెరికా, లండన్, కెనడా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్ తదితర దేశాలతో పాటు భారతదేశంలో ఉన్నత విద్యాకోర్సుల్లో చేరి చదువుకునేందుకు వసతి కల్పించినట్లు వర్సిటీ నిర్వాహకులు తెలిపారు. కాగా, ఉద్యోగావకాశాలు దక్కించుకున్న విద్యార్థులను వర్సిటీ యాజమాన్యం అభినందించారు.

డార్లింగ్ గ్రూప్ నిర్వాహకుడికి పురస్కారం


వెంకటసుబ్బుకు అవార్డు ప్రదానం చేస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుందరేశ్, వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

వేలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో డార్లింగ్ గ్రూపుకు 'బెస్ట్ క్యాటరర్' అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎంఎం సుందరేశ్ పురస్కారాన్ని డార్లింగ్ గ్రూప్ నిర్వాహకులు వెంకటసుబ్బు, డైరెక్టర్ మురళికి అందజేశారు. కార్యక్రమంలో వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, వర్శిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, రమణి, మేనేజింగ్ డైరెక్టర్ సంధ్య, ఉపాధ్యక్షులు కాదంబరి విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులకు బహుమతులు



వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

తిరుత్తణి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులోని సాయిశ్రీ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల 30వ వార్షికోత్సవం, స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలు, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా రాజాజీపురం భారతి మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలు ప్రిన్సిపాల్ ఎస్.పార్థసారథి, పట్టాభిరామ్ రామకృష్ణ మెట్రిక్యులేషన్ హయర్ సెకండరీ స్కూలు ప్రిన్సిపాల్ ఎం.రాధ, తిరుముల్లైవాయల్ ఎక్సెల్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలు ప్రిన్సిపాల్ ఆర్.కాసిరాజ్, ఆవడి నబీ క్రెసెంట్ మెట్రిక్యులేషన్ స్కూలు ప్రిన్సిపాల్ ఎస్ఏ బాలకృష్ణన్, కె.గులాబ్‌హుస్సేన్, జేవై జాకబ్ గ్రూప్ ఆఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ జేమ్స్ జయరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేసీ విజయ్‌కుమార్, టీఏ ఎస్ఎం.గురుమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ


భూమి పూజలో మంత్రి దురైమురుగన్

వేలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం గాంగేయనల్లూర్‌లో రూ.1.20 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేలు ఏపీ నందకుమార్, కార్తికేయన్, అమ్ములు విజయన్, మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, కౌన్సిలర్లు పుష్పలత, శివశంకరి, అన్బు, విమల, రమేష్, అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీరామనవమి


ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకొస్తున్న దృశ్యం

తిరుత్తణి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులోని కల్యాణ రామ సమేత వీరమంగళ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కల్యాణ రాముడికి మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ జరిగింది. అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పళ్లిపట్టు సహా పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంజిత్ శర్మ, ఆలయ నిర్వాహకులు శ్రీనివాసన్, హేమాద్రి, పురుషోత్తం, శివకుమార్, మోహన్‌రెడ్డి, లోకనాథన్, బాల, దేవ, మోహన్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కనికాలమ్మ దేవస్థానంలో నవమి వేడుకలు


శ్రీరామ గానామృతంలో పాల్గొన్న భక్తులు

అడయార్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత చాకలిపేటలోని కనికాలమ్మ దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. ఇందులోభాగంగా కృష్ణ గీతా సమాజం ఆధ్వర్యంలో శ్రీరామ గానామృత కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు పానకం, ప్రసాదాన్ని భక్తులకు అందజేసినట్టు నిర్వాహకులు వెల్లడించారు.

చెన్నై సెంట్రల్-షాలిమార్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం షాలిమార్-చెన్నై సెంట్రల్-షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.02841 షాలిమార్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 7,14,21 తేదీల్లో షాలిమార్‌లో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరమార్గంలో, నెం.02842 చెన్నై సెంట్రల్-షాలిమార్ ప్రత్యేక రైలు ఈ నెల 9,16,23 తేదీల్లో చెన్నై నుంచి తెల్లవారుజామున 4.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. ఈ రైలు గూడూరు, విజయవాడ, దువ్వాడ, సింహాచలం రోడ్డు, విజయనగరం, బ్రహ్మపూర్ మీదుగా వెళ్తాయని ఈ ప్రత్యేక రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

బ్లాక్‌లో ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

● 11 మంది అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్న 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. చేపాక్కంలో శనివారం మధ్యాహ్నం చెన్నై సూపర్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్ టిక్కెట్లు రెండు రోజుల ముందు ఆన్‌లైన్‌లో విక్రయించారు. టిక్కెట్లు దొరకని అభిమానులు భారీగా స్టేడియం వద్దకు చేరుకోగా కొందరు అధిక ధరలకు టిక్కెట్లు విక్రయించారు. మైదానం, పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో ఉన్న పోలీసులు, బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న 11 మందిని అరెస్ట్‌చేసి, వారి నుంచి 34 టిక్కెట్లు, రూ.30,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆస్కా ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం


శ్రీరామనవమి వేడుకల్లో ఆస్కా అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి, కేకే.చౌదరి తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని ఆంధ్ర ఆండ్ సోషల్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆస్కా అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి సారథ్యంలో ఆస్కా ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సీతారామలక్ష్మణులను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు కేకే.చౌదరితో పాటు పలువురు తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈబీ ప్రత్యేక శిబిరంలో 1,976 సమస్యల పరిష్కారం

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా సమస్యల పరిష్కార ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 178 నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో నిర్వహించిన శిబిరాల్లో విద్యుత్ బిల్లులు, విద్యుత్ మీటర్లు, విద్యుత్ స్తంభాలు, పేరు మార్పు, విద్యుత్ కోతలు తదితరాలపై ప్రజలు 11,022 వినతిపత్రాలు సమర్పించగా, శిబిరంలోనే 1,532 సమస్యలకు సత్వర పరిష్కరించినట్లు, మిగిలిన వాటిపై చర్యలు చేపట్టాలని సంబంధిత కార్యాలయ అధికారులను ఆదేశించామన్నారు. వళ్లువర్‌కోట్టం సమీపంలోని మైలాపూర్ నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో విద్యుత్ బోర్డు చైర్మన్ రాధాకృష్ణన్, అన్నానగర్, పల్లావరం ప్రాంతాల్లో నిర్వహించిన శిబిరాల్లో విద్యుత్ బోర్డు డైరెక్టర్ మాస్కెరెన్స్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించినట్లు ఈబీ ఒక ప్రకటనలో తెలిపింది.

తరగతి గదిలో విద్యార్థిని మృతి

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థిని స్పృహతప్పి మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. తెన్‌కాశి జిల్లా సురండై సమీపం ఇరట్టైకుళం నార్త్ వీధికి చెందిన ప్రకాష్-మీనా దంపతులకు మానస (14) అనే కుమార్తె ఉంది. మానస సురండై శివగురునాథపురం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తరచూ స్పృహతప్పి పడిపోయేదని, దీనికోసం ఆమె చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఇంటి నుంచి సైకిల్‌పై వచ్చిన మానస, తరగతి గదిలోకి వెళ్లిన కొద్దిసేపటికే స్పృహతప్పి పడిపోయింది. ఉపాధ్యాయులు ఆమెను వెంటనే సురండై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ఆమె మృతిచెందింది. సురండై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. తిరువణ్ణామలై జిల్లాకు చెందిన దేవదర్శన్ (19) వేళచ్చేరిలోని బంధువుల ఇంట్లో ఉంటూ అదే ప్రాంతంలోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. శనివారం అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో దేవదర్శన్ మోటార్ సైకిల్‌లో వేళచ్చేరి నుంచి బయల్దేరారు. వేగంగా వెళ్తున్న బైక్ హఠాత్తుగా అదుపుతప్పి డివైడర్ ఢీకొనడంతో దేవదర్శన్‌కు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న గిండి ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. దేవదర్శన్ హెల్మెట్ ధరించని కారణంగా తీవ్రగాయాలతో ప్రాణాలు కోల్పోయాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో సెంగోట్టయన్ భేటీ

● అన్నాడీఎంకేలో చర్చ



అడయార్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ ఆదివారం భేటీ అయ్యారు. గిండిలోని ఓ హోటల్‌లో సుమారు గంటపాటు జరిగినట్టు సమాచారం. కొన్ని రోజుల క్రితం ఢిల్లీలో నిర్మలా సీతారామన్‌ను కలిసిన ఆయన... మళ్ళీ చెన్నైలో ప్రత్యేకంగా కలిసి చర్చించడం అన్నాడీఎంకే వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్టానం అనుమతి లేకుండా మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ కావడం గమనార్హం.

సీమాన్, వేల్ మురుగన్ కూడా...

నగరంలో ఉన్న నిర్మలా సీతారామన్‌ను నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్, తమిళగం వాళ్వురిమై కట్చి అధ్యక్షుడు బన్రుట్టి వేల్‌మురుగన్ కూడా కలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కలిసి నామ్ తమిళర్ కట్చి పోటీ చేయాలని భావిస్తున్న తరుణంలో నిర్మలా సీతారామన్‌తో సీమాన్ భేటీకావడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరి మధ్య రాజకీయ అంశాలపై చర్చ జరిగినట్టు రాజకీయ వర్గాల సమాచారం. అయితే, వేల్ మురుగన్ మాత్రం.. తాను మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం కాలేదని చెప్పడం గమనార్హం.

10న రాష్ట్రానికి రానున్న అమిత్‌షా

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ నెల 10వ తేదీ రాష్ట్రంలో పర్యటిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేతో మళ్లీ కూటమి ఏర్పడే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఢిల్లీలో ఇటీవల అమిత్‌షాతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ హఠాత్తుగా భేటీ కావడంతో ఈ రెండు పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదిరే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

హరి దర్శకత్వంలో 'ప్రశాంత్-55'

● ఘనంగా ప్రశాంత్ బర్త్‌డే వేడుకలు



'ప్రశాంత్-55' అనౌన్స్‌మెంట్‌లో త్యాగరాజన్, ప్రశాంత్, హరి

తమిళ చిత్రజ్యోతి

హీరో ప్రశాంత్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాను నటించే 55వ చిత్రంపై అధికారిక ప్రకటించారు. ప్రీతి త్యాగరాజన్ సమర్పణలో త్యాగరాజన్, శాంతి త్యాగరాజన్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. స్టోరీ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చి హరి దర్శకత్వం వహించనున్నారు. 2002లో ప్రశాంత్ - హరి కాంబినేషన్‌లో 'తమిళ్' చిత్రం తెరకెక్కగా, సిమ్రాన్ హీరోయిన్‌గా నటించారు. హరి దర్శకత్వంలో చివరగా విశాల్ హీరోగా 'రత్నం' అనే చిత్రం వచ్చింది. ఈ నేపథ్యంలో తన తొలి చిత్ర హీరో ప్రశాంత్‌తో దర్శకుడు హరి మరో చిత్రం చేయనున్నారు. ఇందులో ప్రశాంత్ సరసన పూజా హెగ్డే, కయదు లోహర్ నటించనున్నారు. ఈ చిత్రంపై ఆదివారం ప్రశాంత్ పుట్టిన రోజు సందర్భంగా నిర్మాత త్యాగరాజన్ ప్రకటించారు. ఇందులో హీరో ప్రశాంత్ మాట్లాడుతూ, 'హరి దర్శకత్వంలో మరో మారు నటించడం చాలా సంతోషంగా వుంది. గత 25 యేళ్ళుగా మాయిద్దరి మధ్య మంచి స్నేహ సంబంధాలున్నాయి. మీడియాతో పాటు ప్రేక్షకులు అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, పక్కా స్క్రీన్‌ప్లే, స్క్రిప్టుతో ఈ మూవీని రూపొందిస్తాం. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు బహుమతిగా నా తండ్రి త్యాగరాజన్ ఏమిచ్చారని అడుగుతున్నారు. ఇదిగో... హరి దర్శకత్వంలో ఓ భారీ చిత్రానికి ప్లాన్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు భారీ బడ్జెట్ అవుతుందని చెప్పినా ఆయన వినిపించుకోలేదు. ఇంతకంటే బహుమతి నాకు ఏమి కావాలి. హరి దర్శకత్వంలో నేను నటించిన 'తమిళ్' చిత్రంకంటే వెయ్యి రెట్లు భారీ హంగులతో ఉంటుంది' అని వెల్లడించారు. దర్శకుడు హరి మాట్లాడుతూ, 'దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ప్రశాంత్ చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం వచ్చింది. మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో మంచి చిత్రాన్ని అందించేందుకు ప్రయత్నిస్తాం' అని పేర్కొన్నారు. ఇదిలావుంటే, పుట్టిన రోజు జరుపుకున్న ప్రశాంత్‌కు అనేక మంది సినీ ప్రముఖులు, నటీనటులు స్వయంగా, సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

8 నుంచి ఆ నిర్మాతల సంఘానికి పనిచేయం

● ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్.కె.సెల్వమణి



ఈ నెల 8వ తేదీ నుంచి తమిళ సినీ నిర్మాతల మండలిలో సభ్యులుగా ఉంటూ సినిమాలు నిర్మించే చిత్రాలకు పనిచేయమని దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘ సమాఖ్య (ఫెఫ్సీ) అధ్యక్షుడు, సినీ దర్శకుడు ఆర్.కె.సెల్వమణి వెల్లడించారు. ఈ విషయంపై ఆయన తాజాగా మీడియాతో మాట్లాడుతూ, 'తమిళ చిత్రపరిశ్రమలో ఐక్యత లేదు. కోలీవుడ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. అదేసమయంలో తమిళ సినీ నిర్మాతల మండలి సభ్యులు నిర్మించే చిత్రాలకు ఫెఫ్సీ కార్మికులు ఈ నెల 8వ తేదీ నుంచి పనిచేయరు. అయితే, తమతో కలిసి పనిచేయాలని తమిళనాడు ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కోరింది. అందువల్ల ఈ నిర్మాతల మండలితో కలిసి పనిచేస్తాం. మలయాళ చిత్రపరిశ్రమలో ఉన్నట్టుగా వీపీఎఫ్ చార్జీలను గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని యాక్టివ్ నిర్మాతల మండలి కోరింది. అలాగే, డిజిటల్, ఓటీటీ వ్యాపార కార్యకలాపాలు సజావుగా పూర్తి చేసేందుకు ఫెఫ్సీ సాయం చేస్తుంది' అని పేర్కొన్నారు. ఇదిలావుంటే, తమిళ సినీ నిర్మాతల మండలి మాత్రం 'తమిళనాడు సినీ నిర్మాణ కార్మికుల సంఘం' పేరుతో కొత్తగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది.



'కృష్ణ లీలా బ్రైడ్ కలెక్షన్' ఆవిష్కరిస్తున్న నటుడు ప్రశాంత్ తదితరులు

జోయలుక్కాస్‌లో 'శ్రీకృష్ణ లీలా బ్రైడ్ కలెక్షన్'

అడయార్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని ప్రశాంత్ గోల్డ్ టవర్‌లో ఉన్న జోయ్‌లుక్కాస్ షోరూమ్‌లో 'కృష్ణ లీలా బ్రైడ్ కలెక్షన్'ను హీరోయిన్ అల్య మానసతో కలిసి ప్రశాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు రవి మరియా, జోయ్‌లుక్కాస్ సీవోవో హెన్రీ జార్జ్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో వివిధ రకాలైన డిజైన్స్‌తో తయారు చేసిన బంగారు నగల ఆభరణాలను ప్రదర్శన, విక్రయానికి ఉంచారు.

ఎస్కేపీడీలో శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

● 10న కల్యాణోత్సవం



హంసవాహనంపై రామయ్య చిద్విలాసం

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రతిరోజు ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరిస్తారు. 10వ తేదీ సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం, 17న ఆంజనేయ ఉత్సవం జరుగనుంది.

రెండు రోజుల విరామం తర్వాత మళ్ళీ అసెంబ్లీ

అడయార్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల వారాంతపు సెలవుల అనంతరం రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సభా కార్యక్రమాల్లో గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖలకు చెందిన అనుబంధ పద్దులపై చర్చ జరుగనుంది. ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

● కల్యాణం-కమనీయం... తెలుగు లోగిళ్లలో సీతారాముల కల్యాణోత్సవం

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవిమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాజధాని నగరం చెన్నైలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. కోదండ రామయ్య కల్యాణఘట్టాన్ని వేదపండితులు, పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాములోరి కల్యాణ కోసం తెలుగు లోగిళ్లను అరటి, మామిడి, తోరణాలతో అలంకరించడంతో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. సీతారాములను అలంకరించి పల్లె వాతావరణం తలపించేలా పురవీధుల్లో భక్తుల జైశ్రీరామ్ నామస్మరణ, మేళతాళాల మధ్య ఊరేగించారు. ఇక తెలుగు సంప్రదాయం, సంప్రదాయ వస్త్రధారణ, తెలుగు వంటకాలు, వడపప్పు, పానకం, ప్రసాదాల పంపిణీ, చదివింపులు తదితర కార్యక్రమాలు తెలుగు లోగిళ్లలో సందడి నెలకొంది.



కల్యాణోత్సవంలో ఆంధ్రకళా స్రవంతి నిర్వాహకులు

ఆంధ్రకళా స్రవంతిలో.. : కొరట్టూర్ అగ్రహారంలోని కొదండరామాలయంలో ఆంధ్రకళా స్రవంతి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తుల సమక్షంలో భద్రాద్రి రామయ్య క్షేత్రంలో లాగే సీతారాముల కల్యాణం జరిపించారు. సంస్థ అధ్యక్షులు జేఎం.నాయుడు, సలహాదారు ఎంఎస్.మూర్తి, కార్యదర్శి జే.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, ఇతర సభ్యులతో కూడిన కమిటీ సమక్షంలో జరిగిన ఉత్సవంలో ఐదుగురు దంపతులు పెళ్ళి పెద్దలుగా పాల్గొన్నారు. చివరగా భక్తులందరికి అన్నప్రసాదాలు వితరణ చేశారు.

వ్యాసర్పాడిలో...

వ్యాసర్పాడి ఎంకేబీనగర్ 14వ వెస్ట్ క్రాస్ వీధిలోని వలంపురి వ్యాస వినాయక దేవస్థానం ప్రాంగణంలోఉదయం గణపతి పూజతో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12గంటలకు కోదండరామ స్వామి తిరుకల్యాణ ఘట్టాన్ని పురోహితులు నిర్వహించారు. శ్రీరామ భక్తబృందం ఆర్గనైజర్ మొలగనూర్ విజయ్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.



హాజరైన తెలుగు భక్తులు

మద్రాసు మిర్చి వర్తక సంఘంలో...



మద్రాసు మిర్చి వర్తక సంఘం ఆధ్వర్యంలో రాములోరి కల్యాణోత్సవం

జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాలులో మద్రాస్ మిర్చి వర్తక సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పురోహితులు వడ్డి వెంకటేశ్వర శాస్త్రి సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సంఘ అధ్యక్షులు శింగారపు శివకుమార్ ఉత్సవ కమిటీ చైర్మెన్ వీజే. సురేష్‌కుమార్, నిర్వాహకులు, ఇతర సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో ఆదిఆంధ్ర సంఘ నిర్వాహకులు

రామ్‌నగర్‌లో..

ట్రిప్లికేన్ రామ్‌నగర్ 10వ వీధిలోని కోదండ రామ భక్తజన బృందం ఆధ్వర్యంలో సీతారాముల తిరుకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆదిఆంధ్ర సంక్షేమ సంఘం రామదాసాంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, అందరికి ప్రసాదాలు పంపిణీ చేశారు. 12వ తేదీ శనివారం వసంతోత్సవం, ప్రత్యేక ఆరాధన, స్వామివారి ఊరేగింపులో భక్తులందరూ పాల్గొనాల్సిందిగా రామ్‌నగర్ ఆదిఆంధ్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.బాబు, కార్యదర్శి పి.నరసింహులు, కోశాధికారి పురుషోత్తం, దర్శిగుంట శేషయ్య కిషోర్ తదితర నిర్వాహకులు పిలుపునిచ్చారు.

సీతారామనగర్‌లో...



సీతారాములను ఊరేగిస్తున్న తెలుగువారు

మూలక్కడై సమీపంలోని సీతారామనగర్ తెలుగుప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 28వ వార్షిక శ్రీసీతారామ కల్యాణమహోత్సవం సంఘ కార్యాలయ ప్రాంగణంలో నేత్రపర్వంగా జరిగింది. సీతారాములను మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సంఘ భవనంలో సీతారాముల కల్యాణం నిర్వహించి మధ్యాహ్నం తెలుగు వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. అధ్యక్షులు బి.సురేష్‌బాబు, కార్యదర్శి పి.లక్ష్మణ్‌రావు, కోశాధికారి డి.పిచ్చేశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసకుమార్, బి.శ్రీధర్ పి.బాలాజీ, డి.సాంబశివరావు, సీఎస్.జయకుమార్, ఎన్ సతీష్, జె.మధుసూదన్, పి.సుబ్బరాజు, టి.నాగరాజు, డి.వినోద్‌కుమార్‌లతో పాటు వంజరపు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

'శివ' ఆధ్వర్యంలో....

స్థానిక ప్యారీస్ గిడ్డంగి వీధిలోని సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్ (శివ) కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు అజంతా డా.కనిగెలుపుల శంకర్‌రావు సారథ్యంలో నిర్వహించిన నవమి పూజలో గౌరవ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, గౌరవ కోశాధికారి పెసల రమేష్, ఉభయదారులు ఎస్కేపీడీ ఛారిటీస్ మాజీ ట్రస్టీ పొన్నూరు వెంకటకృష్ణరావు-మణిమాల దంపతులు, సభ్యులు పాల్గొన్నారు.



నవమి వేడుకల్లో శివ నిర్వాహకులు, భక్తులు

అక్షయబాబా మందిరంలో.....

స్థానిక బ్రాడ్‌వే ఆచారప్పన్ వీధిలోవున్న అక్షయబాబా మందిరంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు విఘ్నేశ్వర పూజ, సంకల్పం అనంతరం సీతారాములకు సారె వస్తువులను ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ వేదోపచార పూజ, మాంగల్య సమర్పణం, ఉపాచం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జై వాసవీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా కనిగెలుపుల శంకర్‌రావు, కోశాధికారి డా.ఎంవీ నారాయణగుప్తా పర్యవేక్షణలో సాగిన ఈ కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులందరికి అన్నతీర్థప్రసాదాలు, మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. పెళ్ళి పెద్దలుగా తిరుమల ట్రేడర్స్ అధినేతలు పి.పుష్పరాజు, కృష్ణవేణి దంపతులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో నిర్వాహకులు, భక్తులు

సీటీఏలో నేత్రపర్వంగా కోదండరాముడి కల్యాణం



చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వలసరవాక్కంలోని చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ)ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోరూరు గణపతినగర్ రాజలక్ష్మి మహల్‌లో శ్రీరామనవమి సందర్భంగా సీతారామకల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. విఘ్నేశ్వరపూజ నుంచి మంగళహారతి వరకు వరుస క్రమంగా మహాకల్యాణోత్సవాన్ని క్రోంపేటకు చెందిన వేదపండితులు శశికుమార్‌శర్మ, మల్లిఖార్జునశర్మ, అరవిందశర్మ, భరద్వాజశర్మ బృందం జరిపించింది. కల్యాణవేదికపై అసోసియేషన్ అధ్యక్షులు కే బాలకృష్ణారెడ్డి, స్వర్ణ దంపతులతోపాటు ఆరుగురు దంపతులు సీతారాములవారి తరపు బంధుజనంగా ఇరువైపులా ఆశీనులై ఈ కల్యాణోత్సవాన్ని నిర్వర్తించారు. ఈ కల్యాణోత్సవానికి కుటుంబసమేతంగా విచ్చేసిన సంస్థ సభ్యులకు, దాతలకు, నగరవాసులకు, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అసోసియేషన్ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి కార్యదర్శి బి.వెంకయ్యనాయుడు, ఉపాధ్యక్షులు జి.సురేష్, విజయేంద్రరావు, సంయుక్త కార్యదర్శి శ్రీనుబాబు, సాంస్కృతిక విభాగం కార్యదర్శి ఏవీ శివకుమారి, కమిటీ సభ్యులు రామ్ ప్రసాద్, మధుకర్, దశరథ రామయ్య, వెంకటరమణయ్య, సుధాకర్ ఏర్పాట్లు చేపట్టారు. అడ్వయిజరీ కమిటీ సభ్యులు చలపతి, ఉమాపతి, పీవీ రవికుమార్, శ్రీకాంత్, నరసింహారావు తదితరులు తమ వంతు సహాయ సహకారాలను అందించారు. కల్యాణోత్సవం అనంతరం తెలుగు సంప్రదాయిక వంటలతో చక్కటి విందు భోజనం కూడా ఏర్పాటు చేశారు.

తెలుగు వైభవాన్ని ముందు తరాలకు అందించాలి

● ఏడీజీపీ కల్పన నాయక్
● లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్‌లో ఘనంగా ఉగాది సంబరాలు

ప్యారీస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని, వైభవాన్ని ముందు తరాలకు అందించేలా నేటి తరం కృషి చేయాలని తమిళనాడు అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డి.కల్పన నాయక్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ 324ఎం, 2024-25 చైర్ పర్సన్స్ పీఎంజేఎఫ్ లయన్ టి.సురేష్, లయన్ కె.రమేష్ అధ్యక్షతన శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. కొరట్టూర్‌లోని మోహన్ గార్డెన్‌లో జ్యోతి ప్రజ్వలన, పంచాంగ పఠనం, ఎస్కేడీటీ తెలుగు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అనంతరం ఉగాది వేడుకలను లయన్ టి.సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ నేపథ్యగాయకులు ఎం.రాము, శ్రీవర్ధిని సారథ్యంలో నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను మైమరపించాయి. ముఖ్యఅతిథులుగా ఏడీజీపీ ఐపీఎస్ అధికారి కల్పన నాయక్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్.వరదరాజన్, అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, ఏఐటీఎఫ్ ఉపాధ్యక్షులు డాక్టర్ సీఎం కిషోర్, సీనియర్ నటీమణి, దర్శకురాలు క్షేమామని డాక్టర్ జయచిత్ర పాల్గొన్నారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ, మనతో కూడా సమాజం బాగుండాలనేదే లయన్స్ క్లబ్‌ల లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, కుల,మత, భాషలకు అతీతంగా 200 దేశాల్లో ఉన్న లయన్స్ క్లబ్‌లో అంకితభావంతో సేవలందిస్తున్నాయని, సమాజాన్ని ఆదుకోవడంలో ప్రధాన పాత్రపోషిస్తున్నాయిని ప్రశంసించారు. చివరగా సినీనటి జయచిత్ర మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా సురేష్, రమేష్ బృందం ఈ ఉగాది వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చివరగా ఏడీజీపీ కల్పన నాయక్ మాట్లాడుతూ, తమిళనాడు రాజధాని నగరంలో ఇంతమంది తెలుగువారి మధ్య ఉగాది వైభవంలో అతిథిగా పాల్గొనడం తనకెంతో సంతోషం అనిపించిదన్నారు. రాయలసీమలో జన్మించి తెలంగాణ ఆడపడుచుగా తనకు రెండు తెలుగు రాష్ట్రాల్లో లాగే, వృత్తిరీత్యా తమిళనాడులో కూడా తెలుగువారితో మంచి సంబంధాలున్నాయన్నారు. అన్ని భాషలను గౌరవించి అమ్మభాషను అమితంగా ప్రేమించాలని ఆమె సూచించారు. ఈ వేడుకల్లో ఆస్కా మాజీ అధ్యక్షులు మాదాల ఆదిశేషయ్య, లయన్ విజేంద్రరావు, డాక్టర్ ఏవీ శివకుమారి, పుళల్ కావాంగరై తెలుగుప్రజా సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షులు లయన్ జి.మురళి, లయన్స్ క్లబ్ ప్రముఖులు ఎస్.బోస్, రాజేష్, ఎం.జోషి, పీఎస్ఎస్ ఉదయసూర్యన్, కె.చంద్రశేఖరన్, సి.మీనాక్షి సుందరం, ఎస్.శేఖర్ సహా పలు క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా అతిథులకు జ్ఞాపికలు అందజేసి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



తాళ్లూరి సురేష్, రమేష్‌లను అభినందిస్తున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్.వరదరాజన్, అతిథులు

ప్రత్యేక విద్యార్థులకు క్రీడా పోటీలు



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ యునైటెడ్ చెన్నై, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై స్నేహమ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలోని జిల్లా క్రీడా కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో నగరంలోని 22 ప్రత్యేక పాఠశాలలకు చెందిన 275 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామ్.ఎన్.రామమూర్తి, నిర్వాహకులు రోటరీ క్లబ్ ఆఫ్ యునైటెడ్ చెన్నై ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై ప్రెసిడెంట్ ప్రీతా మహేష్‌లు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3233 మాజీ జిల్లా గవర్నర్ డా.ఎన్.నందకుమార్, జిల్లా గవర్నర్ దేవేంద్రన్ దామోదరన్‌లు పాల్గొన్నారు.